మట్టిని పిండి..
ఫిల్టర్ ఇసుకను చేసి..!

పలమనేరు నియోజకవర్గంలోని కౌండిన్య నదిలోని ఇసుక మొత్తం కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడునెలలకే ఖాళీ అయింది. ఉచితంగా ఇసుకను తోడుకోవచ్చని సీఎం చంద్రబాబే చెప్పడంతో ఇసుకాసురులకు వరమైంది. కౌండిన్యలో ఇసుక లేకున్నా నదికి పక్క ఉన్న మట్టిని నది నీళ్లలోకి వేసి, రాత్రుల్లో దాన్ని జేసీబీతో కలియతిప్పుతూ ఫిల్టర్ చేసి, పొద్దున మట్టిలోని ఇసుకను తోడేస్తున్నారు. మహాభారతంలో రథచక్రం భూమిలో కూరుకుపోతే నేలపాలైన నెయ్యిని కర్ణుడు మట్టిని పిండి నెయ్యిని తీసినట్టు ఇసుకాసురులు మట్టిని పిండి ఇసుకను తీసి జేబులు నింపుకుంటున్నారు.

- కౌండిన్యలో ఇసుకాసురుల కొత్త టెక్నిక్
- రాత్రిపూట నీళ్లలో ఫిల్టరింగ్
- పగటి పూట డంపింగ్..ఆపై ట్రాక్టర్లతో రవాణా
- రోజూ 150 ట్రాక్టర్ల ఫిల్టర్ ఇసుక తరలింపు


నీటి ప్రవాహంలో మట్టిని పోసి కిందవైపు ఫిల్టరింగ్


ఫిల్టర్ చేసి డంప్ చేసిన ఇసుక


జీడుమాకులపల్లి వద్ద కౌండిన్య నదిలోఇసుకలో దింపిన మట్టి

పలమనేరు: కౌండిన్య నదిలోని ఇసుక కలిసిన మట్టిని ట్రాక్టర్లతో తీసుకెళ్లి నదిలో నీరున్న గుంతల్లో పడేస్తున్నారు. ఇలా వేసిన మట్టి లోడ్లను రాత్రుల్లో జేసీబీతో ఫిల్టర్ చేస్తారు. ఉదయం నీటిలో పైనున్న ఇసుకను మాత్రం తోడి గట్టున వేసుకుని నీటితో నానిన ఇసుకను ఓ చోట ఆరబెట్టేందుకు డంప్ చేస్తున్నారు. నియోజకవర్గంలో కౌండిన్య ప్రవహించే పెద్దపంజాణి నుంచి గంగవరం, పలమనేరు మండలాల్లోని 40 గ్రామాల్లో ఇదే తంతు కొన్నాళ్లుగా జోరందుకుంది. గంగవరం మండలంలోని జీడిమాకులపల్లెలోనే 18 ట్రాక్టర్లు, రెండు జేసీబీలున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రోజూ 150 ట్రాక్టర్ల ఫిల్టర్ ఇసుక అమ్మకం

అట్టే పెద్దగా శ్రమ లేకుండా ఆదాయం కళ్లజూస్తుండడంతో ఒకరిని చూసి మరొకరు ఆయా గ్రామాల్లో ఇదే పని చేయడం మొదలెట్టారు. దీంతో నదిలో ఎటూ చూసినా నీళ్లున్న గుంతల్లో మట్టి లోడ్లను దింపిన ప్రదేశాలు కనిపిస్తున్నాయి. నదికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఎంతలేదన్నా రోజూ 150 ట్రాక్టర్ల ఇసుక అమ్మకాలకు తరలిస్తున్నారంటే ఇక్కడ ఫిల్టర్ ఇసుక అక్రమ రవాణా ఏ స్థాయిలో సాగుతోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి మట్టి నుంచి తయారు చేసే చేసే ఇసుకను ఇళ్లు, భవన నిర్మాణాలకు వాడితే ఏమాత్రం వాటికి మన్నిక ఉండదని తెలిసినా ఫిల్టర్ ఇసుకాసురులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా మట్టి నుంచి ఇసుకను పిండేస్తున్నారు.

మెడపై పచ్చ కండువా..
సెల్‌పై చంద్రబాబు చిత్రం

అధికారులు, పోలీసులు ఎవరూ చూసినా ఇసుక తరలించేవారిని మాట్లాడకుండా మెడపై పచ్చ కండువా వేసుకుని ట్రాక్టర్లు నడుపుతున్నారు. మరికొందరు సెల్‌ఫోన్ వెనుక చంద్రబాబు ఫొటోలు పెట్టుకోగా, ఇప్పుడు కూటమి వాళ్లమంటూ కొందరు ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలను అంటించుకున్నారు! ఇక ట్రాక్టర్లకు పసుపు రంగు కూడావేశారు. ఈ ట్రాక్టర్లకు ఎలాంటి నంబర్లకూడా కూడా ఉండవు. గట్టిగా సౌండ్ పెట్టుకుని కూటమి పాటలను వేసుకుంటూ పట్టపగలే హైవేలో ఇసుక ట్రాక్టర్లు దర్జాగా వెళుతున్నాయి. కనీసం హైవేలోని సీసీ కెమెరాల్లోఒక్క రోజు ఫుటేజీనైనా సంబంధిత శాఖలు చూస్తే రోజూ ఎన్ని ట్రాక్టర్ల ఇసుక వెళుతుందో ఇట్టే లెక్క కట్టొచ్చు. తమ లెక్కలూ సరి చేసుకోవడానికి దీనిని కూడా ఉపయోగించుకుంటే ఇక ఈ ఫిల్టర్ ఇసుక అక్రమ రవాణాకు ఎవరూ అడ్డుకట్ట వేయలేరిక!


నదిలో ఎటూచూసిన ఫిల్టర్ పాయింట్‌లే

నదిలోకి చేరుతున్న నీటితో మరింత సులభంగా..!

ఇప్పటి వరకూ నదిలోని గుంతల్లో మాత్రమే నీరుండేది. దీంతో నదిలోని మట్టిని ట్రాక్టర్లతో వేసుకుని గుంతల్లో వేసి ఫిల్టర్ చేసేవారు. సోమల మండలంలో ఇటీవల కురిసిన వర్షాల మూలంగా పెద్దపంజాణి మండలంలోని రాయల చెరువు మొరవెత్తి ఆ నీరు కౌండిన్యలోకి వస్తోంది. దీంతో నదిలో నీరు పలుచగా వస్తోంది. దీనిని అవకాశంగా తీసుకున్న ఇసుకాసురులు ఎక్కడ మట్టిని అక్కడే నీళ్లలోకి వేసి, ఇసుకను తయారు చేస్తున్నారు.

క్లుప్తంగా

వెంగంవారిపల్లెలో డ్రై డే


వెంగంవారిపల్లెలో అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లెలో శుక్రవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది డ్రై డే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి క్లోరినేషన్ చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఇళ్లలోని నీటి తొట్టెలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వారానికోసారి డ్రైడే పాటించండి


ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పలమనేరు: ప్రజలు వారానికోసారి ప్రతి శుక్రవారం డ్రైడే విధిగా పాటించాలని స్థానిక సబ్‌ యూనిట్ అధికారి జయశంకర్ కోరారు. మున్సిపాలిటీలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఇలా చాలారోజుల పాటు నీటిని నిల్వ ఉంచితే దోమలకు ఆవాసంగా మారుతాయని, ఓ రోజైనా డ్రమ్ములను ఎండబెట్టాలని జ్రలకు సూచించారు. ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి


నాగిరెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బైరెడ్డిపల్లి: మండలంలోని మోట్లపల్లికు చెందిన వైఎస్సార్‌సీపీ నేత నాగిరెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి పలువురు పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, సర్పంచులు వెంకటేష్, బాలక్రిష్ణగౌడు, విజయమ్మ, ఎంపీటీసీలు సుజాత, నాగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు


ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో అర్చనలు, అభిషేక పూజల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబు చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాదాల వితరణ చేశారు.

అమ్మవారి సేవలో దేవదాయశాఖ ఆర్జేసీ


గంగమ్మకు పూజలు చేస్తున్న ఆర్జేసీ

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మను దేవదాయశాఖ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ ఎస్ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ ఏకాంబరం స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయంలో ఇటీవల నెలకొన్న సంఘటనలపై ఆర్జేసీ ఆరా తీశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

రౌడీ తహసీల్దార్లను తొలగించరూ!

- ఆర్డీఓకు బీసీ ఫ్రంట్ నాయకుల వినతి

పలమనేరు: ఇటీవల మద్యం మత్తులో రియల్టర్‌పై రౌడీల్లా దాడి చేసిన గంగవరం, పెద్దపంజాణి తహసీల్దార్లను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని పట్టణానికి చెందిన బీసీ ఫ్రంట్ నాయకులు పూలే గోవిందస్వామి తదితరులు శుక్రవారం స్థానిక ఆర్డీఓకు రేణుకకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రాజకీయ బలంతో డబ్బులు చెల్లించి, ఎఫ్ఏసీ తహసీల్దార్లుగా మారి, అక్రమాలకు పాల్పడుతున్న ఇలాంటి వారి కారణంగా రెవెన్యూ వ్యవస్థకే కళంకమన్నారు. మండల మెజిస్ట్రేట్‌లుగా ప్రజలకు న్యాయం చేయాల్సిన వీరు వీధి రౌడీల్లా బూతులు మాట్లాడడం, దాడులు చేయడం గర్హనీయమన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న బీసీ ఫ్రంట్ నేతలు

నియామకం


జగదీష్‌రాజును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు: మండల బీజేపీ అధ్యక్షుడిగా జగదీష్‌రాజును నియమించారు. శుక్రవారం ఎన్నికల అధికారి విశ్వనాథనాయుడు నియామకపత్రం అందజేశారు. పట్టణ నాయకులు రాజారెడ్డి, మదన్ మోహన్ బాబు, మల్లికారాణి, అయూబ్‌ఖాన్, టీవీఎస్.ప్రసాద్, నానబాలకుమార్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టులు బాగుచేయండి మహాప్రభో..:


పుంగనూరులో దెబ్బతిన్న కల్వర్టు


మార్లపల్లె రోడ్డులో కల్వర్టుపై పడిన గుంతలు

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డు నుంచి తాటిమాకులపాళెంకు వెళ్లే రోడ్డు బ్రిడ్జి, అలాగే మార్లపల్లెకు వెళ్లే రోడ్డుపై కల్వర్టు పగుళ్లు బారి అధ్వానంగా మారింది. వీటికి మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా రోడ్లపై గుంతలు, కల్వర్టులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆమె స్ఫూర్తి..మహిళా విద్యకు ప్రదీప్తి




పుంగనూరు: సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు, పుంగనూరు: గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో.. పలమనేరు: అన్నదానం చేస్తున్న బీసీ ఉద్యోగుల అసోసియేషన్ నేతలు

పలమనేరు: దేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయినిగా కీర్తి గడించిన సాయిత్రిబాయి పూలేను ఇప్పటి ఉపాధ్యాయ లోకం ఆదర్శంగా తీసుకోవాలని బీసీ ఉద్యోగుల సంఘ నేత లక్ష్మీపతి పిలుపునిచ్చారు. శుక్రవారం బీసీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే 194వ జయంతిని స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఘనంగా నిర్వహించారు. సీఐ నరసింహరాజు, ఎంఈఓ లీలారాణి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. బడుగు మహిళల విద్యాభివృద్ధి కోసం అప్పటి రోజుల్లో కట్టుబాట్లు, వివక్ష నడుమ సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని స్మరించారు. అనంతరం అన్నదానం చేశారు. ఎన్జీవో నేత ఆనంద్ బాబు, బీసీ నేతలు కుట్టి, రవి, పురుషోత్తం, లోకేష్ ఆచారి, ఈశ్వర్, బాలు, సోమశేఖర్, నాగరాజు, గిరిబాబు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఇలాగే ఇదే కార్యక్రమాన్ని స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వహించింది. అధ్యక్షులు తులసీనాథం నాయుడు మాట్లాడారు. సమితి కార్యదర్శి పుష్ప, నరేంద్రబాబు, చంద్రశేఖరయ్య, జేవీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: సావిత్రి బాయి పూలే జయంతిని మండలంలోని నాగిరెడ్డిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి హెచ్ఎం బాబురెడ్డి మాట్లాడారు. ప్రతిఒక్కరూ సావిత్రి బాయి ధైర్య సాహసాల బాటలో పయనించాలన్నారు. విద్యతోనే స్త్రీకి విముక్తి సాధ్యమవుతుందని నిరూపించిందన్నారు. బాలికలు విద్య, మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, మాధవన్, రాజేష్ బాబు, ఆంజప్ప తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లి: సావిత్రిబాయి పూలే మహిళామణులకు ఆదర్శనీయమని యండీహెచ్ ఫౌండేషన్ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించిందన్నారు. ఆమె బాలికా విద్యకు పెద్దపీట వేశారని స్మరించారు. అనంతరం ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వీ.కోటలో..

వి.కోట: మండలంలోని గోవిందాపురం ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కీర్తించారు. హెచ్ఎం ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: మహిళల్లో విద్యకు శ్రీకారం చుట్టిన ధీరోధాత్రి సావిత్రిబాయి పూలే అని పలువురు కీర్తించారు. పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు ఆకుల గజేంద్ర రాయల్, హేమంతరాయల్, అద్దాల నాగరాజ, అయూబ్‌ఖాన్, కృష్ణమూర్తి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. అలాగే మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం మహేష్ నారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను సన్మానించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగరాజ రెడ్డి సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించి, ఆమె సేవలను ప్రస్తుతించారు. అనంతరం మహిళా టీచర్లను సన్మానించారు. ఉపాధ్యాయురాళ్లు అరుణకుమారి, విజయలక్ష్మి, పూర్ణిమ, సుమిత్ర, కవిత, కళ్యాణ భారతి, ప్రతిమ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే సేవలు శ్లాఘనీయమని ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇప్పటి మహిళలకు ఆమె పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సావిత్రి బాయి పూలే చిత్రపటానికి వివిధ కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముఖ్యంగా స్త్రీల విద్యకు బలమైన పునాది వేయడంలో విశేష కృషి చేశారని సావిత్రిబాయిని కీర్తించారు. డాక్టర్ రఘునాథ్, రాజేంద్ర నాయుడు, నారాయణస్వామి, మునికృష్ణమాచారి, చంద్రశేఖర్ అచారి, రాజన్న, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలంలోని బగళనత్తం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయినులు రాధాభాయి, కౌశరి అహ్మది, మోహన కుమారి, జానకిలను సన్మానించారు. ఎంఈఓలు మహబూబ్ బాషా, నారాయణ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుప్పం రూరల్‌లో..

కుప్పం రూరల్: మండలంలోని మహ్మద్‌పురం పంచాయతీ కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సైదానాసీర్ మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే మహిళల విద్యకు, అంటరానితనం రూపుమాపడం, మహిళలకు సమానత్వం కోసం చేసిన పోరాటం టీచర్లకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఉపాధ్యాయినులను సత్కరించారు.




బైరెడ్డిపల్లె: ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు, పెద్దపంజాణి: సావిత్రిబాయి పూలేకు పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు, చౌడేపల్లెలో..


సదుం: గురుకుల పాఠశాలలో..


రొంపిచెర్ల: ఆర్టీసీ బస్టాండ్ వద్ద..



రామకుప్పం: ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఎంఈఓలు, కుప్పం రూరల్: కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో..


వీ.కోట: మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రగాయాలైన వెంకటరెడ్డి, రమేష్ రెడ్డి

రామకుప్పం: కారు–ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం ఆంధ్ర–కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన రాజుపేట రోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని కృష్ణమనాయనపల్లెకు చెందిన వెంకటరెడ్డి(45),గెర్నిపల్లెకు చెందిన సురేష్ రెడ్డి(46) స్వంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో కుప్పంకు బయలుదేరారు. మార్గమధ్యంలో రాజుపేట రోడ్డు సమీపంలో కుప్పం నుంచి వస్తున్న కారు వేగంగా వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిలిస్టులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108లో వారిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

కైగల్ ప్రాంతంలో అధికంగా భూ సమస్యలు

బైరెడ్డిపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని పలమనేరు ఎస్.అమరనాథరెడ్డి కోరారు. మండలంలోని కైగల్‌లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కైగల్ ప్రాంతంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కైగల్ ప్రాంతం భవిష్యత్తులో పలమనేరుకే తలమానికంగా నిలబడుతుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుతో పాటు టూరిజం హబ్‌గా కైగల్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కైగల్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడమే కాక హంద్రీ–నీవా కాలువతో నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ చెస్ పోటీలకు కుప్పం విద్యార్థి


జగపతిని అభినందిస్తున్న సీఈఓ

కుప్పం రూరల్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలకు కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థి సి.జగపతి ఎంపికయ్యారు. ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో జగపతి ప్రతిభ కనబరచి మొదటిస్థానంలో నిలిచినట్లు ఆ కళాశాల చైర్ పర్సన్ శాంతా నాగరాజు తెలిపారు. 8వ తేదీ వెల్‌టెక్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్‌వర్సిటీ చెస్ పోటీల్లో అతడు పాల్గొంటాడని ఆమె తెలిపారు. శుక్రవారం జగపతిని కళాశాల సీఈఓ సాగర్‌రాజ్ అభినందించారు.